ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.6, కనిష్ఠం 22.5



కామారెడ్డి
జిల్లా వార్తలు

మంగళవారం 30 జూలై 2024

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

• ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగ సంఘం

బాన్సువాడ టౌన్, జూలై 29: ప్రభుత్వం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగ సంఘం కార్యదర్శి దోసె పల్లి శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017 పే స్కేల్ ఏరియర్స్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎల్ నారాయణ, మహ్మద్, నాగ్‌నాథ్, ఫరీద్, పండరి, రాజేశ్వర్ తదితరులున్నారు.



కార్మికుల కష్టార్జితం కాంట్రాక్టర్ల జేబుల్లోకి..!

- జిల్లాలో భారీ ఎత్తున స్కాంలకు పాల్పడుతున్న పలు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు
- ప్రతీనెల జీతాలు చెల్లించాల్సి ఉన్నా మూడు, నాలుగు నెలలకొకసారి చెల్లింపులు
- నెలల తరబడి జీతాలు రాక అప్పుల పాలవుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- భారీ ఎత్తున అవకతవకలకు పాల్పడుతున్న పలు ఏజెన్సీలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు
- ఇటీవల రీటెండర్‌లకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఉపాధి హామీ కార్యాలయం ద్వారా రీటెండర్, ఏజెన్సీల ఎంపికలు
- అవకతవకలకు పాల్పడుతున్న పలు ఎజెన్సీలకే మళ్లీ పెద్దపీట
- ఎజెన్సీ నిర్వాహకులతో కలిసి పలువురు ఉపాధి కార్యాలయ సిబ్బంది కుమ్మక్కు
- పూర్తిస్థాయి విచారణ జరిపితే నిజానిజాలు బట్టబయలు

కామారెడ్డి, జూలై 29 (ఆంధ్రజ్యోతి)/కామారెడ్డిటౌన్: ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం దొరకాలంటే ఎన్నో వ్యయప్రయాసాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. చిన్ననాటి నుంచి ఎంతో కష్టపడి డిగ్రీ పట్టాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగమే ధ్యేయంగా కృషిచేస్తున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు దొరకడం కష్టతరంగా మారుతుంది. నూటికి పదిమంది మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక అవుతుండగా.. మిగిలిన 90మంది ఏదో ఒక పని చేసుకుని కుటుంబ భారాన్ని మోయాల్సి వస్తుంది. డిగ్రీలు చదివి కూలీ పనులకు వెళ్లలేక కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలవైపు అడుగులు వేస్తున్నారు. తీరా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు సంపాదించాక వారికి జీతభత్యాలు, సౌకర్యాలు కల్పించాల్సిన ప్రైవేట్ ఎజెన్సీల ద్వారా భారీఎత్తున మోసానికి గురవుతున్నారు. ప్రతినెలా రావాల్సిన జీతాలు మూడు, నాలుగు నెలలకొకసారి పొందడం, వారి జీతాల నుంచి కట్‌అవుతున్న పీఎఫ్, ఈఎస్ఐలు వారి పేర్లమీద నమోదు కాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఈ దందా అంతా జిల్లాలో భారీఎత్తున సాగుతున్నా వాటిని అరికట్టే నాథుడే కరువయ్యాడని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు. ఇటీవల ఏజెన్సీలు చేస్తున్న మోసాన్ని పలువురు ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి సైతం తీసుకెళ్లడంతో ప్రభుత్వం రీటెండర్‌లు వేయాలని, కార్మికులు, ఉద్యోగులను దోచుకుంటున్న ఏజెన్సీలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ఆదేశించింది. దీంతో జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా తిరిగి రీటెండర్‌తోపాటు ఏజెన్సీల ఎంపికను చేపడుతున్నట్లు సమాచారం. అయితే ఇక్కడే మళ్లీ ఆ ఏజెన్సీలు చక్రం తిప్పుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉపాధి హామీ కార్యాలయంలో ఒక్కరిద్దరు సిబ్బందితో కుమ్మకై మళ్లీ ఎలాగైన ఏజెన్సీలు దక్కించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవకతవకలకు పాల్పడుతున్న ఏజెన్సీలకే మళ్లీ టెండర్‌లు వచ్చేలా చూస్తే ఇక రీ టెండర్‌లు ఎందుకని పలువురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

దోపిడీని అడ్డుకునే నాథుడే కరువు

రాష్ట్రప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీలను టెండర్ల ద్వారా ఎంపిక చేసి వారికి రెండు, మూడు నెలలకొకసారి డబ్బులను చెల్లించేలా ఒప్పందాలు చేసుకుంటుంది. ఆ ప్రైవేట్ ఏజెన్సీలు ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు కావాల్సిన కార్మికులను, వివిధ రకాల సిబ్బందిని నియమించుకుని ప్రభుత్వం చేపడుతున్న పనులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరవయ్యేలా చూడాల్సి ఉంటుంది. ఆ పనులకు పెట్టిన ప్రతీ బిల్లుకు ప్రభుత్వం నెలల వ్యవధిలో డబ్బులు చెల్లిస్తూ ఉంటుంది. అప్పటివరకు ప్రతీనెల జీతాలను కార్మికులు, సిబ్బందికి ఏజెన్సీ నిర్వాహకులే క్రమంతప్పకుండా చెల్లించాల్సి ఉంటుంది. జీతాలతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్‌లను చెల్లించాలి. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర జీఎస్‌టీలకు డబ్బులను సైతం ఏజెన్సీ నిర్వాహకులే చెల్లించాల్సి ఉంటుంది. కానీ వీటన్నింటిని ఏజెన్సీ నిర్వాహకులు విస్మరిస్తూనే ఉన్నారు. ప్రతీనెల జీతాలు చెల్లించడం ఎక్కడా చేయడం లేదు. ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదంటూ కుంటిసాకులు చెబుతూ కార్మికులు, సిబ్బందికి ప్రతీనెల జీతాలు ఇవ్వకపోవడం, పీఎఫ్, ఈఎస్ఐలను కట్టకపోవడం ప్రభుత్వాలకు చెల్లించాల్సిన జీఎస్‌టీలను చెల్లించకపోవడం లాంటివి చేస్తున్నారు. పైగా ఉద్యోగులకు వచ్చే జీతాల నుంచి మాత్రం ఆ డబ్బులను కట్‌చేసి తమ సొంతానికి వినియోగించుకుంటున్నారు. ఒకవేళ ఏదైనా అవకతవకలు జరిగి ప్రభుత్వం ఈ ఏజెన్సీలను క్యాన్సల్ చేయిస్తే కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్‌టీ డబ్బులను నూతనంగా వచ్చిన ఏజెన్సీలు చెల్లించకపోవడంతో కార్మికులు, సిబ్బంది తెల్లముకం వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నిబంధనల ప్రకారం ఏజెన్సీలు టెండర్‌లు వేసిన సమయంలోనే జిల్లాకేంద్రంలో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి కార్మికుల, సిబ్బంది ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సి ఉన్న అలాంటి కార్యాలయాలు లేవని తెలుస్తోంది. జిల్లా ఉపాధి కార్యాలయంలో టెండర్‌లు వేసిన ఏజెన్సీలలో ఒకటి, రెండు కార్యాలయాలు మాత్రమే ఉండగా పదుల సంఖ్యలో కార్యాలయాలే కనిపించకపోవడం కొసమెరుపు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులకు ముడుపులు ఇవ్వడంతో ఆ కార్యాలయాలు ఉన్నాయా లేదా అనేది చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.


ప్రభుత్వం దృష్టికి ఏజెన్సీల దోపిడీ నిర్వాకం

ప్రభుత్వ కార్యాలయాల్లో దోపిడీకి గురవుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులలో కొందరు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో ఏజెన్సీలు చేస్తున్న అవకతవకలపై ప్రభుత్వం రీటెండర్‌లు వేయాలని కార్మికులను, సిబ్బందిని మోసం చేస్తున్న ఏజెన్సీలను బ్లాక్‌లీస్టులో పెట్టాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా టెండర్లకు ఆహ్వానించారు. టెండర్ల ప్రక్రియ చేపట్టగానే పాత ఏజెన్సీలతోపాటు కొత్తఏజెన్సీలు దరఖాస్తులు చేసుకున్నాయి. అయితే ముడుపులు తీసుకుంటున్న కొందరు సిబ్బంది మళ్లీ పాత ఏజెన్సీలకే టెండర్లు దక్కేలా నిబంధనల పేరుతో మాయచేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ ఏజెన్సీలలో కొందరుసిబ్బంది సైతం భాగస్వామ్యం ఉండడం, వారికి ముడుపులు ఇచ్చే వారికి, మళ్లీ అవకాశం దక్కేలా చూడడం చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీల ద్వారా ప్రతినెలకు ఇంతాఅని ముడుపులు కూడా మాట్లాడుకుంటూ అవకతవకలకు పాల్పడుతున్న పలు ఏజెన్సీలకే దక్కేలా చూస్తున్నారని నేడో, రేపో ఆ ఏజెన్సీలను ఆ లిస్టులో పెట్టనున్నారని సమాచారం. పైగా పాతవారు లేకపోతే వారికి వచ్చే ముడుపులు దక్కవని, కొత్త వారికి ఎక్కడ టెండర్లు దక్కకుండా చక్రం తిప్పుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణతో నిజానిజాలు బట్టబయలు

ప్రైవేట్ ఏజెన్సీ నిర్వాహకులు చేస్తున్న దోపిడీ, నిబంధనలు బేఖాతారు, వారికే ఎప్పుడు టెండర్లు దక్కేలా వ్యవహరిస్తున్న సిబ్బంది పనితీరు, టెండర్ల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ జరిపితే నిజానిజాలు బట్టబయలు పడే అవకాశాలు ఉన్నాయి. అయితే ఉపాధి హామీ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ఏజెన్సీ నిర్వహకులతో మాట్లాడుకుని ఉపాధి కార్యాలయంలో పేర్లు నమోదుచేయించుకున్న నిరుద్యోగులకు దక్కాల్సిన ఉద్యోగాలను దక్కకుండా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల మెడికల్ కళాశాల ప్రారంభ సమయంలో అందులో చేపట్టిన ఉద్యోగాల భర్తీలో పెద్దమొత్తంలోనే అవకతవకలు జరిగాయనే వాదనలు వినిపిస్తున్నాయి. దాదాపు ఒక్కో పోస్టుకు రూ.2లక్షల చొప్పున అదే కళాశాలలో పనిచేసిన ఓ ఉద్యోగి మధ్యవర్తిత్వం ద్వారా ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఉద్యోగాలు భర్తిచేశారని ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగాల భర్తీ, ఏజెన్సీల టెండర్ ప్రక్రియలపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు బయటకు వచ్చేఅవకాశాలు లేకపోలేదు.





నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


• పోచారం ప్రాజెక్టులలోకి స్వల్పంగా వస్తున్న వరద

కామారెడ్డి, జూలై29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో గడిచిన 24గంటల్లో జిల్లావ్యాప్తంగా 6.4 మి.మీ.ల వర్షం కురిసింది. అత్యధికంగా కామారెడ్డి మండలంలో 2.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పలు చెరువులు, వాగుల్లోకి వరద వచ్చి చేరుతోంది. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్వల్పంగా వరద వస్తోంది. ప్రాజెక్టులోకి 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నిజాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.737 టీఎంసీలో మాత్రమే నీరు నిల్వ ఉంది. పోచారం ప్రాజెక్టులోకి సైతం 383 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.820 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.604 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉంది. పలుచోట్ల కురుస్తున్న వర్షాలతో చెరువు, కుంటల్లో నీరు చేరుతోంది.

రెండో విడత రుణమాఫీకి 24,816 మంది అర్హులు

• మాఫీ నిధులు రూ. 211 కోట్లు
• నేడు అసెంబ్లీలో మాఫీ నిధులను విడుదల చేయనున్న సీఎం

కామారెడ్డి జూలై 29(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న రుణమాఫీ రెండో విడత అర్హులైన రైతుల వివరాలను సోమవారం ప్రకటించింది. రూ.లక్ష నుంచిరూ. 1.50 లక్షల లోపు రుణాలు ఉన్న రైతుల జాబితాను విడుదల చేసింది. జిల్లాలోని కామారెడ్డి ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాల్లో రెండో విడుతలో రుణమాఫీలో అర్హులైన రైతులు 24,816మందిగా ప్రభుత్వం గుర్తించింది.



వీరందరికి రూ. 211.72 కోట్లు నిధులు అవసరమని ప్రభుత్వం నిర్ధారించింది. ఈ అర్హులైన రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులను జమ చేయనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ నుంచి మంగళవారం రెండో విడత రుణమాఫీ నిధులను విడుదల చేస్తారు. ఇప్పటికే రూ. లక్ష లోపు రుణాలు తీసుకున్న 45,290 మంది రైతుల ఖాతాల్లో రూ. 233 కోట్లు జమ చేసింది. నేడు రెండో విడత రుణమాఫీని ప్రభుత్వం మాఫీ చేయనున్నందన రైతుల్లో టెన్షన్ నెలకొంటుంది. ఈ విడుతలోనైన రుణం మాఫీ అయితుందో లేదో అని ఎదురుచూస్తున్నారు.

పెట్రేగుతున్న సైబర్ మాఫియా!

• జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలు • ఏపీకే యాప్‌ల పేరుతో నకిలీ లింకులు పంపి మోసాలు
• ఆ లింక్‌ను ఓపెన్ టచ్ చేస్తే ఖాతాలో డబ్బులు ఖాళీ • జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో బాధితులు
• ఆధార్, బ్యాంకు వివరాలు చెప్పొద్దని, అనవసర లింక్‌లను ఓపెన్ చేయదంటున్న అధికారులు

కామారెడ్డిటౌన్, జూలై 28: రోజురోజుకూ సాంకేతికత పెరుగుతుండగా అదే స్థాయిలో సైబర్ నేరాలూ అధికమవుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ల వినియోగం విరివిగా అందుబాటులోకి రావడంతో నిత్యం ఏదో ఒక యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం అలవాటుగా మారింది. ప్రజల అమాయకత్వం, అత్యాశను ఆసరాగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు రోజుకోరకంగా దోచుకుంటున్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఏటీఎం కార్డుల నంబర్లు, ఇతర వివరాలు అడగడం,మీకు పర్సనల్ లోన్ అప్రూవ్అయిందని కొన్నివివరాలు చెబితే రూ. 50వేల నుంచి రూ.1లక్షవరకు మీ ఖాతాలో జమ అవుతాయని లేదంటే లాటరీలో మీరు బహుమతులు గెలుచుకున్నారని, బహుమతులకు ఎంపికయ్యారని మాయచేస్తూ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఇదిలా ఉంటే గత కొద్దిరోజులుగా బ్యాంక్‌ల పేరుతో ఏపీకే యాప్‌లు వాట్సాప్ గ్రూప్‌లలో వినియోగదారునికి సంబంధం లేకుండా అప్‌లోడ్ అవుతున్నాయి. ఆ లింక్‌లను ఓపెన్‌చేస్తే బ్యాంక్‌లోని ఖాతాలు కాలి అవడంతో పాటు ఆ ఫోన్లు సైతం హ్యాక్‌అవుతున్నాయి. ఫేస్‌బుక్, ఫోన్‌పే, ఇన్‌స్టాగ్రామ్ వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉన్నవారిని తేలికగా ప్రలోభపెడుతున్నారు. వీరి వలలో పడిన వారు ఆర్థికంగా నష్టపోయి, మానసికంగా కుంగిపోతున్నారు. ప్రముఖ బ్యాంకుల లోగోలతో ఇష్టారీతిన మెసేజ్‌లు చేస్తు ఖాతాలను ఖాళీ చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని, పైగా పోలీసుల పేర్లతో ఫోన్‌కాల్స్ చేయడం,వారి ఫొటోలను డీపీలుగా పెట్టుకుని మరి బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏ కాల్ వచ్చినా స్థానిక పోలీసు స్టేషన్‌లలో సంప్రదించాలని పోలీసులు సూచిస్తున్నారు.



ఇటీవల బ్యాంకుల పేర్లతో వాట్సాప్‌లలో చక్కర్లు కొడుతున్న ఏపీకే లింక్‌లు

• వాట్సాప్‌లలో ఏపీకే యాప్‌లతో బురిడీ

సెల్‌ఫోన్ నంబర్‌కు ఆధార్‌తోపాటు బ్యాంకు ఖాతాలు, భూముల వివరాలు, ఉద్యోగ సమాచారం వంటివన్ని అనుసంధానం చేస్తు లావాదేవీలు చేస్తున్నారు. దీంతో నేరగాళ్ల పని సులువవుతోంది. ఏదోరకంగా ఫోన్‌నంబర్‌ను సేకరించి దానికి ఉన్న యూపీఐ ఐడీని తెలుసుకోవడానికి అనేకరకాల లింక్‌లను సృష్టిస్తున్నారు. అమాయకంగా నొక్కితే ఖాతాలోని డబ్బులు నొక్కేస్తున్నారు సైబర్ కేటుగాళ్లు. వారు తయారు చేసిన ప్రోగ్రామింగ్ యాప్ నుంచి బ్యాంక్ ఖాతా నిలిచిపోయిందని గూగుల్‌పే, ఫోన్‌పై ఇకపై వాడలేరని లేదంటే పర్సనల్‌లోన్ మీ నంబర్‌కు అప్రూవల్ అయిందని,కంపెనీ డీలర్‌షిప్ కల్పిస్తామని,ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని రకరకాలుగా మాయచేస్తు పలు సందర్భాలలో యాప్‌లను పరిశీలిస్తున్న వారిని ఎంచుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల వాట్సాప్‌లలో ప్రముఖ బ్యాంకుల లోగోలతో వాట్సాప్‌లలో ఏపీకే యాప్‌లు చక్కర్లు కొడుతున్నాయి. వాట్సాప్‌లను హ్యాక్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు వినియోగదారునికి తెలియకుండా గ్రూప్‌లలో మెసేజ్‌లు పంపుతున్నారు ఆ గ్రూప్‌లలో ఉన్నవారు వచ్చిన మెసేజ్‌లు నకిలీ, ఒర్జినల్ తెలియక కంగారులో లింకును నొక్కగానే వారి ఖాతాలోంచి డబ్బులను నొక్కేస్తున్నారు.

• వందల్లో భాదితులు

సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి మోసపోయిన బాధితులు జిల్లాలో చాలామంది ఉన్నారు. ఈరెండు,మూడునెలల్లోనే పదుల సంఖ్యలో మోసపోయారు. ముఖ్యంగా పట్టణ కేంద్రంలో నివాసం ఉంటూ బాగా చదువుకుని నిత్యం సెల్‌ఫోన్‌లో జరిగే మోసాలను తెలుసుకుంటున్న వారు సైతం సైబర్ బురిడికి గురవుతున్నారు. కేవలం తమ ఇబ్బందులను గట్టెక్కెందుకు సైబర్ నేరగాళ్లు విసురుతున్న వలలో చిక్కి మరింత డబ్బులను పోగొట్టుకుని మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నెలల వ్యవధిలోనే అనేక రకాలుగా సైబర్ నేరగాళ్ల గాలానికి చిక్కి లక్షలు పోగొట్టుకున్న వారు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పోలీసు కళాజాతతో పాటు స్థానిక పోలీసులు అనేక రకాలుగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినా ఏదో ఒకరూపంలో సైబర్ నేరగాళ్లు వారి పంతను మార్చుకుంటూ దోపిడీకి పాల్పడుతూనే ఉన్నారు. వాట్సాప్ గ్రూప్‌లలో ఏపీకే యాప్‌లతోపాటు ఈ మధ్యకాలంలో పోలీసుల పేర్లతోనే బెదిరింపులకు పాల్పడి తమ కుటుంబంలోని వ్యక్తి అరెస్ట్ అయ్యాడని, మీరు వెంటనే డబ్బులు తీసుకురావాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులను సంప్రదించాలని హెచ్చరిస్తున్నారు.



అప్రాన్‌ల వద్ద ..బీటలు వారిన వంతెన

- హడావిడిగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్న వైనం
- ససేమిరా అంటున్న పాలకులు, అధికారులు
- మహారాష్ట్ర, తెలంగాణ వారధిగా మంజీరాపై ఈ హైలెవల్ వంతెన
- బీటలు వారుతున్న నిజాంసాగర్ సమీపంలోని వంతెన
- ఆందోళనలో వాహనదారులు

హైలెవల్ వంతెనకు మూన్నాళ్లకే బీటలు!



జాయింట్ల వద్ద ఐరన్ సిమెంట్ బీటింగ్‌లు పగిలిపోయిన దృశ్యం



అప్రాన్‌ల వద్ద బీటలు వారిన దృశ్యం

పక్కనే ఉన్న నైజాం కాలం నాటి వంతెన నిజాంసాగర్ వరద గేట్ల వరద

నిజాంసాగర్, జూలై 29: నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న మంజీరా వంతెనపై మహారాష్ట్ర, కర్ణాటక వారధిగా 2016లో ఈ వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ప్లాన్ నిధుల కిందట రోడ్డు భవనాల శాఖ రూ.25కోట్లు వెచ్చించింది. అన్నాసాగర్/పిట్లం రహదారిపై 3/8 కిలోమీటర్ల నుంచి 4/4 వరకు మంజీరా నదిపై వంతెన నిర్మాణానికి కార్యచరణ రూపొందించింది. 2016లో అప్పటి రోడ్డు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేతుల మీదుగా వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ పనులు చేపట్టిన సదరు సంస్థ 2017లో ఈ వంతెన నిర్మాణ పనులను చేపట్టి 2022 వరకు సుమారు ఐదు సంవత్సరాల వరకు పూర్తి చేశారు. తాకిడికి సైడ్‌వాల్ కూలిపోయింది. అప్పట్లో రోడ్డు భవనాల శాఖ అధికారులు ఆదరబాదరగా ఈ వంతెనపై నుంచే రాకపోకలు 2022 ఆగస్టు నుంచి రాకపోకలు సాగించారు. వంతెన తుది మెరుగులు దిద్దుకున్నాయి. 2023 మార్చి 15న అప్పటి పురపాలకశాఖ మంత్రి తారక రామారావు చేతుల మీదుగా వంతెన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అప్పటికే వంతెన పనులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. వంతెనకు 12 పిల్లర్లతోపాటు మరో రెండు అప్రాన్‌లతో పనులు చేపట్టారు. స్లాబ్ జాయింట్లను ఇష్టారాజ్యంగా పనులు చేపట్టిన సదరు సంస్థ జాయింట్ల పనులు సక్రమంగా చేయకపోవడంతో వంతెన పనులు మున్నాళ్లకే మారుతున్నాయి. ఇనుప రాట్లు, ఐరన్ తదితర వేసినా సిమెంట్, బీటిలు విరిగిపోయి బీటలు వారుతున్నాయి. నిజాంసాగర్ మండల కేంద్రంలో ఉన్న అప్రాన్‌గోర్గల్ మాగి గేట్లవైపు ఉన్న అప్రాన్‌కు కూడా బీటలు వారాయి. రోడ్డు భవనాల శాఖాధికారులు తూ తూ మంత్రంగా మరమ్మతులు చేపడుతున్నా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా రోడ్డు భవనాల శాఖ వ్యవహరించడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఏళ్ల పాటు సంబంధిత వరంగల్ కాంట్రాక్టర్‌కు ఉన్నప్పటికీ సంబంధిత కన్‌స్ట్రక్షన్ వారు వంతెన బీటలకు మరమ్మతులు చేపట్టలేక పోతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా ససేమిరా అనడం గమనార్హం. రోడ్డు భవనాలశాఖ అధికారులు స్పందించి వంతెనకు ఏర్పడిన బీటలకు తగుమరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే పది కాలాల పాటు మన్నాల్సిన వంతెన మూలనపడే అవకాశం ప్రమాదం ఉందని పలువురు చర్చించుంటున్నారు.



వర్నిలో దోమల నివారణకు చర్యలు

వర్ని,జూలై29: వర్ని మండల కేంద్రంలో సోమవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. సత్యనారాయణ పురం పంచాయతీ కార్యదర్శి సాయిలు, ఆపరేటర్ రవి ఆధ్వర్యంలో మిలాథిన్ పౌడర్‌ను మండల కేంద్రం వ్యాప్తంగా చల్లారు. అపరిశుభ్రత నివారణకు చర్యలు చేపట్టినట్లు కార్యదర్శి తెలిపారు.

న్యాయం చేయాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

ఎడపల్లి. జూలై29:మండలంలోని మంగల్‌పాడ్ గ్రామానికి చెం దిన రైతు మాల పెద్దులు తనకు లక్షలోపు పంట రుణం ఉన్నా మాపీ కాలేదని, తనకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం మానవ హక్కుల క మిషన్‌కు, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రైతుమాట్లాడుతూ తన పేరిట మరియు తన భార్య మాలగంగామణి పేరిట ఎడపల్లి మండలంలోని ఎడపల్లి, మంగల్‌పాడ్ రెవెన్యూ శివారులో కలిపి ఉన్న ఎకరం 24 గుంటల భూమిపై ఎడపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఎడపల్లి ప్రాథమిక సహకార సంఘం, కెనరాబ్యాంకు మంగల్‌పాడు బ్రాంచి నందు అన్నీ కలిపి రూ.98040 పంట రుణం తీసుకున్నామని, ప్రభుత్వం ప్రకటించిన లక్షలోపు రుణం తమ కుటుంబానికి మాపీ కాక పోవడంతో మండల వ్యవసాయ అధికారి సిద్ది రామేశ్వర్‌ను సంప్రదించి వివరణ కోరగా తను తీసుకున్న రూ.98040 పంట రుణంతోపాటు, అదనంగా రూ.లక్షా ఇరవైవేల కుర్నాపల్లి గ్రామానికి చెందిన ఘటక చిన్నసాయులు ఎడపల్లి ప్రాథమికసహకార సంఘంలో నీయొక్క ఖాత పైరుణం తీసుకున్నట్లు ఉన్నదని ఆయన తెలిపారు.నాఆధార్ కార్డు, పట్టాబుక్కు ఉపయోగించినాఖాతాపై ఇంకొకరు ఎలారుణం పొందుతారు అని సహకార సంఘం కార్యదర్శిని నిలదీయగా టెక్నికల్ సమస్య అని చెబుతూ తప్పించుకుంటున్నాడని ఆయన అన్నారు.మానవ హక్కుల కమిషన్‌కు మరియు జాతీయఎస్సీఎస్టీ కమీషన్‌కు స్పీడు పోస్టుద్వారా ఫిర్యాదు చేశారని తెలిపారు.

'పొలం బాట'లో బీటెక్ విద్యార్థినులు



ఖిల్లా డిచ్‌పల్లిలో మహిళ రైతులతో బీటెక్ విద్యార్థినులు

డిచ్‌పల్లి,జూలై 29: హైదరాబాద్ మల్లారెడ్డి కళాశాలకు చెందిన బీటెక్ విద్యార్థినులు సో మవారం ఖిల్లా డిచ్‌పల్లి, దూస్‌గాం శివారులో పోలంబాట పట్టి వరినాట్లు వేశారు. పలు చోట్ల కలుపు సైతం తీశారు.మహిళలతో కలిసి నాట్లు వేయడం ఎంతో ఆనందం కల్గిందని విద్యార్థినులు తెలిపారు.

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

కమ్మర్‌పల్లి, జూలై29: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొనసముందర్ గ్రామానికి చెందిన ఎం.జయంత్‌కు వైద్యఖర్చుల నిమిత్తం రూ.2లక్షల 50వేల ఎల్‌వోసీని సోమవారం అందజేశారు.మెరుగైన చికిత్సకు భారీ ఖర్చు అవుతుండడంతో బాధితుడి కుటుంబసభ్యులు బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ సునీల్‌కుమార్‌ను ఆయన సీఎం సహాయ నిధి నుంచి చికిత్స నిమిత్తం ఎల్‌వోసీని మంజూరు చేయించి కుటుంబసభ్యులకు అందజేశారు. అపద సమయంలో ఆదుకున్న సునీల్‌కుమార్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలి పారు.

ఆలయానికి సౌండ్ సిస్టం వితరణ

ఆర్మూర్‌టౌన్,జూలై29: పట్టణంలోని రాంనగర్‌లోని రామాలయానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు రజనీష్‌కిరాడ్ సౌండ్‌సిస్టంను అందజేశారు. ఆలయంలో సౌండ్ సిస్టం చెడిపోవడంతో ఆలయ కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు సుమారు రూ.4వేల విలువ గల సౌండ్ సిస్టంట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజరి వెంకటరమణచారి, ఆలయ కమిటీ చైర్మన్ కొక్కుల లింగం, రోటరీ క్లబ్ సభ్యులు రాస ఆనంద్, పిట్ల శశిధర్, పుష్పకర్‌రావు, ప్రవీన్‌పవార్, తదితరులు పాల్గొన్నారు.

'దాడి చేయించిన వారిని అరెస్టు చేయాలి'

ఆర్మూర్‌టౌన్ , జూలై29: నందిపేట మండలం తల్వేద గ్రామంలో పెద్ద పెద్దన్నపై దాడి చేయించిన సాయిరెడ్డిని అరెస్టు చేయాలని సీపీఐ, సీపీఎం, ఐఎఫ్‌టీయూ, ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం దళితుడైన పెద్ద పెద్దన్నపై దాడి చేయించి భూమిని కబ్జా చేయాలని ప్రయత్నించారని అప్పుడు దాడికి పాల్పడ్డ వారిపై, దాడి చేయించిన వారిపై ఫిర్యాదు చేశామని, అందులో కొందరిని అరెస్టు చేసి సాయిరెడ్డిని ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా అరెస్టు చేయకపోతే జిల్లా కేంద్రంలో ఉద్యమం చేపడతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం డివిజన్ కార్యదర్శి దాసు, పల్లపు వెంకటేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివాజీ, ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మూగ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.





















పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బోధన్‌రూరల్,జూలై29: బోధన్ మండలంలోని పెంటాఖుర్దు ప్రభుత్వ పాఠశాలలో సోమవారం 1994-95 సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 30సంవత్సరాల కలిసిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకుని తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు, చిన్ననాటి తీపి గుర్తులను పంచుకున్నారు. వివిధ హోదాలలో ప్రభుత్వ సంస్థల్లో స్థిరపడ్డారని ఒకరినొకరు చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో గురువులు, రిటైర్డ్ ఎంఈవో శాంతకుమారి, వీరయ్య, త్రిపుర, హెడ్‌మాస్టర్ రత్నాకర్, పూర్వ విద్యార్థులు సాయిలు, దత్తాత్రి, ప్రభాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌నగర్‌లో వాహనాల తనిఖీ



కిసాన్‌నగర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

ముప్కాల్, జూలై29: బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలో సోమవారం స్థానిక ఎస్సై యాసిర్‌హర్పిత్ వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని, లైసెన్స్‌లు వాహనాలు, నెంబర్‌ప్లేట్ లేకుండా రోడ్డుపై నడిపిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలని, వాహనాలను విధించిన చానల్‌ను తప్పకుండా చెల్లించాలన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వ వద్దని మైనర్‌లు వాహనాలు నడపవద్దని అన్నారు. ఈ తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ జయవంతరావు, కానిస్టేబుళ్లు సదానంద్, సాయికుమార్, పాల్గొన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న గుట్కా ప్యాకెట్ల పట్టివేత



గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నవీపేట,జూలై29: మండల కేంద్రంలోని కిరాణ దుకాణాలలో అక్రమంగా విక్రయిస్తున్న గుట్కా ప్యాకెట్లను సోమవారం పట్టుకోవడం జరిగిందని ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. కొండ కార్తీక్ కిరాణ దుకాణంలో రూ.2,700 విలువైన గుట్కా ప్యాకెట్‌లు, దోండి వినోద్ కిరాణ దుకాణంలో రూ.4800 విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకోవడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. అక్రమంగా గుట్కా, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

నిషేధంపై నిర్లక్ష్యం ఎలా ?



పారేసిన నిషేధిత గుట్కా సంచులు

ఎడపల్లి, జూలై29: రాష్ట్ర ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం గుట్కాలను, తంబాకు లాంటి మత్తు పదార్థాలను నిషేధించింది. దీంతో రాష్ట్రంలో విచ్చల విడిగా అమ్మిన గుట్కాలు, తంబాకు వంటి మత్తుపదార్థాలను కొందరు దొంగ చాటుగా రవాణా చేస్తూ పలు పాన్ షాపులలో, కిరాణా షాపులకు సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామ శివారులోని బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న దర్గా దగ్గర పదుల సంఖ్యలో సంచులలో నిషేధిత గుట్కాలు దర్శనమిచ్చాయి. ఇవి దాదాపు రూ.50 వేల వరకు విలువ ఉంటాయని, ఇవి అక్కడ ఎవరు పడవేశారో, ఎందుకు పడవేశారో అని అక్కడికి వచ్చిన ప్రజలు గుసగుస లాడుతున్నారు. తనిఖీలో పట్టుబడినవా? లేక పట్టుబడిన తరువాత అధికారులే ఇక్కడ పారవేశారో తెలియాల్సి ఉంది. స్థానికులు ఈవిషయంపై 6వ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు.

మంగల్‌పాడ్‌లో యువతి అదృశ్యం



పూజ(ఫైల్)

ఎడపల్లి, జూలై29:ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి మండలం మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన బరడిరాధ, పోశెట్టి దంపతుల కూతురుపూజ (21)గత నెల 24వ తేదీ న మగ్గం వర్క్‌కు సంబంధించిన వస్తువులు తీసు కు వస్తానని చెప్పి నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి రాకపోవడంతో,బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీలభిం చకపోవడంతో ఆదివారం రాత్రి స్టేషన్‌కు వచ్చి యువతి తల్లి బరడి రాధ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

లక్కోర రోడ్డుపై నీటి గుంతలు



లక్కోరలో రోడ్డుపై ప్రమాదకరంగా మారిన నీటి గుంత

వేల్పూర్, జూలై29: మండల గ్రామమైన లక్కోరలో ప్రభుత్వ పాఠశాల సమీపంలోని వెనుక భాగంలో రోడ్డుపై ఏర్పడిన నీటి గుంత ప్రమాద కరంగా మారింది. ఈ రోడ్డును సీసీరోడ్డుగా నిర్మించిన సమయంలో నాణ్యత లేకుండా లెవల్ సరిగ్గా చేయకుండా నిర్మించడం వల్ల రోడ్డు లోతుకు కుంగిపోయి పెద్ద గుంతగా ఏర్పడింది. గతవారం రోజులుగా కురుస్తున్న వర్షం నీరంతా లోతు గుంతలో చేరి నిలిచిపోయాయి. దీంతో ఆరోడ్డు గుండా వెళ్లాలంటే ప్రజలు, వాహనదారులకు ఇబ్బంది మారింది. ఇటీవల ఓ చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ఆ నీటి గుంతలో పడిపోయింది. అక్కడే ఉన్న కొందరు ఆ చిన్నారిని నీటి గుంత నుంచి బయటకు తీశారు. ఆపాటికే ఆ చిన్నారి కొంత వరకు బురదనీరు మింగడంతో డాక్టర్ వద్దకు తీసుకువెళ్లి చికిత్స చేయించడంతో ప్రాణపాయం నుంచి బయటపడిందని స్థానికులు తెలిపారు. ఈ నీటి గుంత నుంచే నిత్యం విద్యార్థులు పాఠశాలకు వెళ్తూ వస్తుంటారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు ప్రమాదకరంగా మారిన నీటి గుంతను మరమ్మతులు చేపట్టి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాల కుటుంబీకులు కోరుతున్నారు.

గుంతలమయమంగా సిరికొండ- చిన్నవాల్గోట్ రోడ్డు

- రోడ్డు బాగులేక గాయాల పాలైన విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు



గుంతలుగా మారిన రోడ్డు

సిరికొండ జూలై 29:సిరికొండ - చిన్నవాల్గోట్ రోడ్డు తారురోడ్డు ధ్వంసమై అధ్వాన్నంగా మారి ప్రయాణికుల పాలిట ప్రమాదకరంగా మారింది. దశాబ్దం క్రితం నిర్మించిన రోడ్డు పాడైపోయిన మరమ్మతు పనులు చేయకపోవడం వల్ల అధ్వాన్నంగా మారింది. ఇందుకు ఈ రోడ్డు బాగయ్యేదెన్నడు అన్ని రెండు గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. పదిహేనేళ్ల క్రితం అనాటి కాంగ్రెస్ ప్రభుత్వం సిరికొండ - చిన్నవాల్గోట్ మధ్యలో గల మూడు కిలోమీటర్ల నిడివి గల ఈ రోడ్డు తారు రోడ్డుగా మార్చింది. రోడ్డుపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌లు తిరుగడం వల్ల రోడ్డంతా ధ్వంసమై గుంతలుగా మారింది. రోడ్డుమరమ్మతు కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం రూ.60 లక్షలు మంజూరు చేసింది.అధికారులు టెండర్లు పూర్తి చేసిన కాంట్రాక్టర్ నిధులు వస్తాయోరావో అనే దానితో పనులు చేయకుండా వదిలేశారు. గత ఎన్నికల కంటే ముందు తిరిగి టెండరు పిలిచిన కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడం పనులు జరుగలేదు.పెద్దవాల్గోట్, పోత్నూర్,చిన్నవాల్గోట్ గ్రామాల నుంచి మండల కేంద్రానికి ప్రజలు రోజు ప్రయాణిస్తారు. మోడల్ స్కూల్‌కు ఈగ్రామాలలకు చెందిన విద్యార్థులు సైకిళ్లపై వస్తారు. ఈ రోడ్డున ప్రయాణించే ప్రయాణికులు, విద్యార్థులు స్కిడ్ అయి పడితే దెబ్బలు తగిలిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వం ప్రయాణికుల భద్రతనుదృష్టిలో పెట్టుకుని రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు చేయించి బాగు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, మూడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిధులు రాగానే పనుల ప్రారంభిస్తాం

చిన్నవాల్గోట్ - సిరికొండ రోడ్డు మరమ్మతుకు కొత్తగా ప్రతిపాదనలు తయారు చేసి పంపిస్తున్నామని పంచాయతీ రాజ్ ఏఈ ఆహ్మద్ హుస్సేన్ తెలిపారు. గతంలో మంజూరైన రూ.60 లక్షలు సరిపోవడం లేదని కొత్తగా ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు.నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంబిస్తామని ఏఈ చెప్పారు.

\- ఆహ్మద్ హుస్సేన్,పంచాయతీరాజ్ ఏఈ

ప్రమాదకరంగా మారిన రహదారి

- గుంతలతో వాహనదారుల అవస్థలు



కోటగిరి-ఎక్లాస్‌పూర్‌లో రహదారిపై ఏర్పడ్డ గుంతలో వర్షపు నీరు

కోటగిరి,జూలై29: కోటగిరి-ఎక్లాస్‌పూర్ అధ్వానంగా మారింది. కోటగిరి నుండి ఎక్లాస్‌పూర్ వెళ్లే రహదారి చిన్నపాటి వర్షాలలకు రహదారిపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు నిలుస్తుంది. మోకాలి లోతు గుంతలు పడి వర్షపు నీరు నిలవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో ఎక్లాస్‌పూర్, కొత్తపల్లి, సుద్దులం, అడ్కాస్‌పల్లి, లింగాపూర్‌తో పాటు ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. వందలాది మంది మండల కేంద్రానికి వచ్చి వెళ్తుంటారు. మండల కేంద్రంలోని సుమారు 400మీటర్ల రహదారి అధ్వానంగా తయారైంది. వర్షం పడిదంటే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వాహనాలు వెళ్లే క్రమంలో బురదనీరు పక్క నుంచి వెళ్లే వారిపై పడుతోంది. 400మీటర్ల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైన పనులు చేపట్టకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువలు నిర్మించి చేతులు దులుపుకున్నారు. రహదారిపై కనీస మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతల్లో నీరు నిల్వకుండా మొరం వేసి రహదారి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్య నిగూఢమైన ధనం

- విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి: బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్ రావు



హాజరైన పట్టణ ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు



విద్యార్థులకు ప్రవచనాలు చేస్తున్న చాగంటి



చాగంటి కోటేశ్వర్ రావును కలిసిన ప్రముఖులు

బోధన్‌రూరల్,జూలై29: విద్య నిగూఢమైన ధనమని నేటితరం విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని బ్రాహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని విజయసాయి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చాగంటి కోటేశ్వర్‌రావు విలువలతో కూడిన విద్య అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ప్రసంగించారు.జ్యోతి ప్రజ్వలన అనంతరం చిన్నారులు చేపట్టిన కూచిపూడి నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ జీవితంలో వచ్చే కష్టాలకు భయపడవద్దని, ఎన్ని కష్టాలు వచ్చిన వాటిని ఎదుర్కొని పోరాడి గెలవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. విద్య కంటికి కనబడని ఆభరణం అని విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం అనేక కష్టాలను ఓర్చుకుని ఒడిదుడుకులకులోనై పిల్లల బాగు కోసం కృషి చేస్తారని అలాగే విద్యార్థులు కూడా ఉన్నత స్థానాలకు చేరుకుని తమ తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలన్నారు. మనిషి జీవితంలో విద్యతోనే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని, విద్య ప్రాముఖ్యతను తెలియజేశారు. చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచనాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈకార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మశరత్‌రెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లతో పట్టణ ప్రముఖులు, వేద పండితులు ప్రవీణ్ మహరాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి



బోధన్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూలై29: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు డల్లా సురేష్ మాదిగ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణ సాధనకై హలో మాదిగ. చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్‌ల సాధనకై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎస్.రమేష్ మాదిగ నాయకత్వంలో ఆగస్టు 10,11వ తేదీలలో ఢిల్లీ కేంద్రంగా జంతర్ మంతర్ వద్ద మహధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం అయినటువంటి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అఖిలపక్షం బృందాన్ని తీసుకెళ్లాలని మాదిగ సమాజం తరఫున కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కే.గంగాధర్, పానుగంటి సాయిలు, బాషల సాయిలు, బాబు మాదిగ, కుమ్మన్‌పల్లి నర్సింహులు, సాయన్న, మల్లికార్జున్, కొండ్ర అజయ్, మారుతీ, వడ్డేపల్లి శేఖర్, పోశెట్టి తదితరులున్నారు.

టీయూ గ్రంథాలయానికి బీటలు






టీయూ గ్రంథాలయంలో బీటలు వారిన గోడలు

డిచ్‌పల్లి,జూలై 29: తెలంగాణ విశ్వవిద్యాలయంలోని సెంట్రల్ లైబ్రెరీ భవనం నిర్మించిన పదేళ్ల కాలంలోనే అన్ని గదుల్లో బీటలు వారాయి. 2014 జూన్ 27న ప్రారంభించిన వర్సిటీ సెంట్రల్ లైబ్రెరీ పనులు కాంట్రాక్టర్ హడవిడిగా చేయడం నాణ్యత లోపం పదేళ్లకాలంలోనే గోడలు బీటలు వారాయి. ఇటీవల విద్యుత్ స్విచ్‌బోర్డులలో కూడా మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ అలక్ష్యం కారణంగా భవన నిర్మాణ పనులు నాణ్యతకు తూట్లు, దాచేందుకు పాట్లు అనే చందంగా తయరైంది. విద్యార్థులు చదువుకునే సమయంలో ఏ ఉపద్రవం వస్తుందోనని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే బీటలు వారిన ప్రాంతాల్లో మరమ్మతులు చేప ట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.4కోట్లలతో నిర్మించిన సెంట్రల్ లైబ్రెరీ పనులు తక్షణమే మరమ్మతులు చేసేల అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరు తున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు



ఆయిల్ పామ్ మొక్కలు నాటుతున్న అధికారులు

ఏర్గట్ల,జూలై 28: ఆయిల్ పామ్ సాగుతో లాభాలు పొందవచ్చిని ఉద్యానవన అధికారి రుద్ర వినాయక్ తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా రైతులను ఆయిల్ పామ్ సాగువైపు మళ్లించేందుకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సోమవారం మండలంలోని బట్టాపూర్ గ్రామంలో కట్కం సామంత్‌కు సంబంధించి ఆరుఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఉద్యానవన అధికారి రుద్రవినాయక్,ప్రీ యూనియన్ కంపెనీ మండల ఆయిల్ పామ్ అధికారి ప్రేమ్‌సింగ్ ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఉద్యానవన శాఖ అలాగే ప్రీయూనియన్ అయిల్ పామ్ కంపెనీ వారు సంయుక్తంగా మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు.ఈకార్యక్రమంలో గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

పంట నష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఆర్మూర్‌టౌన్,జూలై29:మండలంలోని ఇస్సాపల్లి గ్రామశివారులో మొక్క జొన్న పంట నష్టాన్ని సోమవారం వ్యవసాయాధికారి హరికృష్ణ పరిశీలించారు. ఇటీవల అడవి పందుల మొక్కజొన్న పంట దాడి చేసి సుమారు ఎకరం వరకుపంట ధ్వంసం చేయగా సుమారు రూ.లక్ష20 వేల వరకు నష్టం వాటిల్లినట్టు రైతు నూతుల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆర్థికంగా నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

వైద్యశాఖలో ముగ్గురు అధికారుల బదిలీ

కోటగిరి,జూలై29: కోటగిరి మండలంలో వైద్యశాఖలో పని చేస్తున్న ముగ్గురు అధికారులు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీలలో భాగంగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ కోటగిరి నుండి నిజామాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయానికి బదిలీ అయ్యారు. సూపర్‌వైజర్ జ్యోతి వర్నికి బదిలీ కాగా మరో సూపర్‌వైజర్ సాలూరకు బదిలీ అయ్యారు.

రైల్వే వంతెన కింద నిలిచిన వర్షపు నీరు

- వాహన చోదకులకు తప్పని తిప్పలు



రైల్వే వంతెన కింద నిలిచిన వర్షం నీరు

డిచ్‌పల్లి,జూలై29: మండలంలోని నాగా పూర్ జాతీయ రహదారి చేరువలో రైల్వే అండర్ బ్రిడ్జి వర్షం నీరు నిలబడటంతో వాహనచోదకులు తీవ్రఇక్కట్లు పడుతున్నారు. రైల్వే అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని వెంటనే నిలిచిన నీటిని తొలగించేలా చర్యలు తీసుకో వాలని కోరు తున్నారు.

మోటార్ సైకిల్ అపహరణ

డిచ్‌పల్లి,జూలై29: డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే కృష్ణకు చెందిన మోటార్ సైకిల్ గుర్తు తెలియని వ్యక్తులు అలహరించారని బాధితుడు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైల్వేస్టేషన్ వద్ద హీరో గ్లామర్ బైకును దొంగలు అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం

నవీపేట,జూలై29: మండలంలోని మోకన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంజుమాన్‌ఫారంకు చెందిన కోడూరి అశోక్ అనే విద్యార్థి ఆచూకీ లభ్యమైందని ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. ఈ నెల 27న అశోక్ అనే పదో తరగతి విద్యార్థి అదృశ్యం అయిన విషయం విదితమే. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అశోక్ శనివారం పాఠశాల అనంతరం హైదరాబాద్‌లో ఉన్న తన స్నేహితుల వద్దకు వెళ్లాడని ఆయన పేర్కొన్నారు.

పాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమం

మోస్రా,జూలై29: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ మోస్రా పాఠశాలలో గత ఆరు రోజులుగా ప్రభుత్వ ఆదేశాల అనుసారం పాఠశాలలో శిక్షా సప్తాహ అనే ఒక విద్యా కార్యక్రమం నేడు చివరి రోజు సందర్భంగా పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయునది. నేడు సప్తా కార్యక్రమం చివరి రోజు సందర్భంగా హెచ్ఎం బాలాజీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా తిథి భోజన కార్యక్రమం కలదు. కావున మోస్రా గ్రామ పెద్దలకు, వివిధ యువజన సంఘాల యువకులకు, మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులకు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మరియు సభ్యులకు మరియు విద్యార్థి, విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయునది ఏమనగా మీరందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ మోస్రా,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29మంది పేకాట రాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్,జూలై29: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఆదివారం రాత్రి సీసీఎస్ పోలీసులు పేకాట రాయుళ్ళను అరెస్టు చేసి ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పక్క సమాచారం మేరకు పేకాట ఆడుతున్న 29మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.లక్ష 37వేల నగదు, పది కార్డ్లు, ఒక స్కూటి, 24సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై అంజమ్మ తెలిపారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కస్తూర్బాలో పలు అంశాలపై అవగాహన

నిజాంసాగర్, జూలై29: నిజాంసాగర్ పోలీసులు, షీటీం ఆధ్వర్యంలో సోమవారం కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మూఢనమ్మకాలు, రోడ్డుభద్రత, బాల్య వివాహాలు, డ్రగ్స్, మత్తు పదార్థాలు, తదితరవాటిపై అవగాహన కల్పించారు. మహిళలను, విద్యార్థినీలను ఎవరైనా వేధిస్తే 8712686094 నెంబర్‌కు, టోల్ ఫ్రీ 1930కు కాల్‌చేయాలన్నారు. కళాబృందం సభ్యులు పాటలు పాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై సుధాకర్, సిబ్బంది ప్రభాకర్, సాయిలు, శేషారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సురేందర్‌కు అస్వస్థత

ఎల్లారెడ్డి, జూలై 29: ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అస్వస్థతకు గురయ్యారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సోమవారం ఆయన ఓ వీడియోను విడుదలచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం కారణంగా నియోజకవర్గ ప్రజలకు దూరంగా ఉన్నానని, ప్రజల ఆశీస్సులతో కోలుకుని త్వరలో ముందుకు వస్తానని అయన పేర్కొన్నారు. నియోజకవర్గ నాయకులు, ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రజా సమస్యల పట్ల పోరాడటానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో మాట్లాడాలని కేటీఆర్‌కు వినతి

నాగిరెడ్డిపేట, జూలై29: గ్రామ పంచాయితీలతోపాటు మండల జిల్లా పరిషత్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో మాట్లాడాలని మాజీ మంత్రి కేటీఆర్‌ను రాష్ట్ర జడ్పీటీసీల ఫోరం మాజీ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం అసెంబ్లీలో మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి పెండింగ్ బిల్లుల విషయమై కోరినట్లు మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో పంచాయితీ రాజ్ పై చర్చ జరుగుతుందని, ఈచర్చలో భాగంగా గ్రామ పంచాయితీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రాక మాజీ సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులతోపాటు మండల, జిల్లా పరిషత్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో మాట్లాడాలని, పెండింగ్ బిల్లులను ప్రభుత్వం మంజూరు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి కేటీఆర్‌ను కోరినట్లు మనోహర్‌రెడ్డి తెలిపారు.

బాన్సువాడ-కామారెడ్డి రహదారిపై ఇష్టారీతిన పార్కింగ్!

• వాహనదారుల రాకపోకలకు తప్పనితిప్పలు



బాన్సువాడ-కామారెడ్డి ప్రధాన రహదారిపై వాహనాల పార్కింగ్

బాన్సువాడటౌన్, జూలై 29: బాన్సువాడ-కామారెడ్డి ప్రధాన రహదారిపై వాహనదారులు ఇష్టారీతిన తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. మెయిన్‌రోడ్‌లో గల ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట రహదారి సగం వరకు వాహనాల పార్కింగ్ దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. ఈ దారిలో రాకపోకలు సాగించే వారికి ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. అధికారులు స్పందించి రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసే వారిపై జరిమానా విధించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాన్సువాడ అర్బన్‌లో ఏఎన్ఎంల కొరత!

• 32వేల జనాభాకు ముగ్గురే ఏఎన్ఎంలు



సర్వే నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు

బాన్సువాడటౌన్, జూలై29: బాన్సువాడ మున్సిపాలిటీగా మారిన తర్వాత వేగంగా అభివృద్ధి పథంలో దూసుకపోతోంది. చుట్టు పక్కల గ్రామాలు, నియోజకవర్గాల ప్రజలు సైతం బాన్సువాడలోనే నివాసం ఏర్పరచుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. రోజురోజుకూ జనాభా పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 19 వార్డులున్నాయి. అన్ని వార్డుల్లో కలిపి 32వేల354 జనాభా ఉంది. ఇంత జనాభా ఉన్న బాన్సువాడ మున్సిపాలిటీలో కేవలం ముగ్గురంటే ముగ్గురే ఏఎన్ఎంలు ఉన్నారు. ఆశావర్కర్లు కూడా కరువయ్యారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు లేకపోవడంతో ప్రభుత్వం ప్రజారోగ్యం కోసం చేపట్టే సర్వేలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒక్కో ఏఎన్ఎం 19 వార్డుల్లో తిరిగి సర్వేలు చేయాలంటే తలకు మించిన భారమవుతోంది. అధికారులు స్పందించి బాన్సువాడ అర్బన్‌లో ఏఎన్ఎంలను నియమించి, ప్రజలకు సేవలందించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





ఎల్లారెడ్డి బాలికల పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు (ఫైల్)

చినుకు పడితే చిత్తడే..!

• కుంటలను తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఆవరణ • స్కూళ్లలో కుంటుపడుతున్న పారిశుధ్య చర్యలు
• సిబ్బంది లేక ఆగమాగం • పట్టించుకోని విద్యాశాఖ అధికారులు • అవస్థల్లో విద్యార్థులు

ఎల్లారెడ్డి, జూలై 29: చినుకు పడితే చాలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలు బురదతో చిత్తడిగా మారుతున్నాయి. గత వారం రోజులుగా కురిసిన ఎడతెరిపి లేని వానలతో ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలు చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో పాఠశాలలో పారిశుధ్యం పడకేసింది. పాఠశాలలో ప్రారంభించి అభివృద్ధి పనులు వ్యర్థాలు పాఠశాల ఆవరణలోని కుప్పలుపోసి ఉండటంతో పాఠశాల ప్రాంగణాలు చెత్తగా మారుతున్నాయి. ఎల్లారెడ్డి పట్టణంలోని పాఠశాలల్లోని పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల ఆవరణలో నిలిచిన నీరు కుంటలు తలపిస్తుండగా అదే విధంగా ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో నిలిచిన నీరు కుంటను తలపిస్తోంది. పట్టణ ప్రాంతాలలో ఉన్న పాఠశాలలోని పరిస్థితులు ఇలా ఉంటే ఇక గ్రామీణ ప్రాంతాలలో పాఠశాల దుస్థితి అధ్వానంగా ఉంటుంది. గ్రామీణప్రాంతాలు పాఠశాలల, పాఠశాల ప్రాంగణాలతోపాటు వచ్చేదారులు సైతం బురదమయంగా మారి దర్శనమిస్తున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే పాఠశాలలో ఏర్పడుతున్న అపరిశుభ్రత వాతావరణంతో విద్యార్థులకు విషజ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

• సిబ్బంది లేక ఆగమాగం

ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో పాఠశాలల్లో తరగతి గదులతో పాటు ప్రాంగణాలని మురికి కూపాల్లాగా మారుతున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో పాఠశాలల ప్రాంగణాలు మారడం, పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో మిగిలిన వ్యర్థాలు కుప్పలు కుప్పలుగా ఉండటంతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. తరగతి గదులు, వరండాలు తదితర ప్రాంగణాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇక మూత్రశాలలు, మరుగుదొడ్ల పరిస్థితి మరి అధ్వానంగా ఉంది. అంతేకాకుండా వాటి నుండి వస్తున్న దుర్గంధాన్ని వెదజల్లుతూ రోగాలకు కేంద్రాలుగా మారుతున్నాయి.

• విద్యార్థులతో కాలువలు తీయిస్తున్న ఉపాధ్యాయులు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పాఠశాల ఆవరణలు కుంటలుగా తలపించడంతో ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో వర్షపు నీరు పోయే విధంగా పారలతో కాలువలు తీయిస్తున్నారు. ఈ విషయంపై అదేమిటని ఉపాధ్యాయులని కోరగా స్థానిక మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చిన పారిశుధ్య కార్మికులను పంపించడం లేదని విద్యార్థులతో పాటు తాను కూడా పని చేస్తున్నానని తెలిపారు.



జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో ఆగిన నీటి బయటికి పంపేందుకు విద్యార్థులతో కాలువ తీయిస్తున్న దృశ్యం (ఫైల్)

పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

• వంశీ, ఏబీవీపీ నాయకులు, ఎల్లారెడ్డి

ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలి. పాఠశాల ప్రాంగణాల్లో పరిశుభ్రత వాతావరణం కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి వేస్టేజ్‌ను పాఠశాల ప్రాంగణం నుంచి బయటకు తొలగించేందుకు తగిన చర్యలు చేపట్టాలి. పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలి. అప్పుడు పాఠశాలకు వచ్చే విద్యార్థులు రోగాల బారిన పడకుండా ఉంటారు.

అపరిశుభ్రత వాతావరణంతో సీజనల్ వ్యాధులు

• డాక్టర్ రవీంద్రమోహన్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, ఎల్లారెడ్డి

పాఠశాల ప్రాంగణాలు అపరిశుభ్రత వాతావరణంతో ఉంటే విద్యార్థులకు రోగాలబారిన పడే ప్రమాదం ఉంటుంది. వర్షాకాలం కావడంతో పాఠశాల ప్రాంగణాలు నిల్వఉన్న నీటిలో దోమలు నివాసం ఏర్పాటు చేసుకుని మలేరియా, డయేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు, అపరిశుభ్రంగా ఉన్న వైరల్ జ్వరాలు వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుంది.

రూ.9కోట్ల రైతురుణాలపై విచారణ చేపట్టండి

• వ్యవసాయ శాఖ మంత్రికి ఎమ్మెల్యే లేఖ



జీఎస్ఆర్ మాగి షుగర్ ఫ్యాక్టరీ

నిజాంసాగర్, జూలై29: నిజాంసాగర్ మండలం మాగి శివారులో ఉన్న మాగి షుగర్ ఫ్యాక్టరీ అక్రమాలపై విచారణ చేపట్టాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు సోమవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు లేఖరాశారు. ఫ్యాక్టరీ స్థాపించిన నుంచి ఫ్యాక్టరీయాజమాన్యం 1030 మంది రైతుల పేరిట పంట రుణాలు రూ.9 కోట్లు పొందారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాందేవ్‌వాడ బ్యాంకు నుంచి రైతులకు మెసెజ్‌లు వచ్చారు. రుణం తీసుకోకుండా ఎలాంటి మెసెజ్‌లు వచ్చాయని రైతులు ఆందోళన చెందారు. రైతులు చెరకును తరలించేందుకు అగ్రిమెంట్ చేసుకునే సమయంలో బ్యాంకు పత్రాలపై సంతకాలు చేసుకున్నారని ఆరోపించారు. రైతులనుమోసం చేసిన సంస్థ ఫ్యాక్టరీ వ్యాపారాలకే రూ.9కోట్లు వాడుకున్నారని, సదరు రుణం రైతుల పేరిటనే ఉండగా రుణమాఫీ జరుగడంతో మాఫీ అయిన రుణం ఎవరికి చెందుతుందని మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం రుణమాఫీ జరిగిందని ఫ్యాక్టరీ యాజమాన్యానికి అడిగితే చేతులుదులుపుకున్నారని, ప్రశ్నిస్తే రైతులకు బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. రైతులకు మోసం చేసిన ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని నిలదీసేందుకు సిద్ధమేనని అన్నారు. ఈ విషయమై తక్షణమే విచారణ జరిపి రుణమాఫీ పొందిన వారికి రుణాన్ని ఇప్పించాలని మంత్రిని కోరారు.



నల్లమడుగు నేలమత్తడికి బుంగ పడి వృథాగా పోతున్న నీరు

నల్లమడుగు నేలమత్తడికి బుంగ!

లింగంపేట, జూలై 29: మండలంలోని నల్లమడుగు నేల మత్తడికి బుంగ పడి నీరంతా వాగులోకి వెళ్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం నెల రోజులకు వరుణ దేవుడు కరుణించి మామూలు వర్షాలు పడితే వచ్చిన వరద నీరు నేలమత్తడికి బుంగ పడడంతో నీరంతా వారం రోజులుగా వాగులోకి వెళ్లుతుందని, ఎండలు కొడితే రైతుల పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. నీటి పారుదల శాఖ అధికారులకు పట్టించుకోవడం లేదని ఇప్పటివరకు చెప్పుకోదగిన వర్షం పడలేదని చెరువులు కుంటలు నిండలేదని ఉన్న నీరువాగులోకి వెళ్లితే సాగుచేసేది ఎలాఅని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెవన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు స్పందించి బుంగను పూడ్చి నీటిని ఆపాలని రైతులు కోరుతున్నారు.

మురికినీటి మళ్లింపునకు కాలువల పరిశీలన



కాలువలను పరిశీలిస్తున్న దృశ్యం

బిచ్కుంద, జూలై29: మండల కేంద్రంలోని మిషన్ కల్లాలి రోడ్డులో గణేష్ మందిర్ నుంచి రాజుల్లా చౌరస్తా పిడుగు మైసమ్మ వరకు మురికి నీటిని మళ్లించేందుకు కాలువల తవ్వకాలు జరిపేందుకు గ్రామపెద్దలు పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షపునీరు మురికికాలువలలో ప్రవహించి కాలువలలో పలుచోట్ల పూడికలు తొలిగించక నీరు వెళ్లెందుకు దారిలేక రోడ్లపై ప్రవహిస్తుంది. సమస్య పరిష్కారానికి గ్రామపెద్దలు అధికారులతో కలిసి జేసీబీ ద్వారా మురికాలువలో పూడికలు తొలగించి చర్యలు చేపట్టి ప్రజల అవస్థలను దూరమయ్యేలా చూస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో బిచ్కుంద మఠాధిపతి సోమలింగ శివాచార్యులు, సీనియర్ నాయకులు మల్లికార్జున్ అప్పశెట్కార్, పార్టీ అధ్యక్షుడు గంగాధర్, నౌషానాయక్, హనుమండ్లు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

సదాశివనగర్, జూలై29: సదాశివనగర్ మండలం పీఆర్‌టీయూ నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుశాల్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గాదరి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బసంత్‌రాజ్, ఉపాధ్యక్షులుగా బాలకిషన్, కార్యదర్శిగా సాయిరెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా సువర్ణ, మహిళా కార్యదర్శిగా ప్రశాంతి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ మాపై నమ్మకంఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటామని తెలిపారు.

ఫార్మాసిస్టుకు సన్మానం

బిచ్కుంద, జూలై 29: బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రిలో దశాబ్దకాలంపాటు సేవలు అందించిన ఫార్మసిస్ట్ లక్ష్మన్‌ను సన్మానించారు. సోమవారం హన్మాజీపేట్ పీహెచ్‌సీకి బదిలీపై వెళ్తున్న ఫార్మసిస్ట్ లక్ష్మన్‌ను ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది శాలువాతో పూలమాలతో సన్మానించారు. విధి నిర్వహణలో అందరితో కలిసి మెలసి ఉండేవారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సు, ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నిషియన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీర్కూర్‌లో బోనాల పండుగ

బీర్కూర్, జూలై 29: బీర్కూర్ మండలకేంద్రంలో మంగళవారం బోనాల పండుగ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఈ బోనాలపండుగ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆగ్రోచైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు హాజరవుతున్నట్లు సమాచారం. బీర్కూర్‌ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

బీర్కూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ

బీర్కూర్, జూలై 29: బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ గౌడ్ తనిఖీచేశారు. నేరాల కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేకాట స్థావరాలపై దాడులు చేయాలని, బెల్టుషాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఎస్సై రాజశేఖర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	ఓసీ
దర్శన్	డెడ్‌పూల్
ప్రియా 70	కల్కి
ప్రియా 70	రాయన్

బాన్సువాడ	
మహేశ్వరి	రాయన్
వెంకటేశ్వర	పురుషోత్తముడు

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230